క్లుప్తంగా

150 మందికి వైద్య పరీక్షలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలో అను గ్రూప్ హాస్పిటల్స్, అమెరికన్ అంకాలజీ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో 150 మందికి వైద్య సేవలు అందించి, మందులు అందజేశారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు లంక సురేంద్ర మోహన బెనర్జీ ఇంటి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో జనరల్ మెడిసిన్, రక్తపోటు, మధుమేహం, నరాలు, గుండె, క్యాన్సర్ సంబంధిత వ్యాధులకు వైద్యసేవలు అందించారు. ఈసీజీ, ఏకో పరీక్షలు నిర్వహించారు.

మోసపూరిత బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి

గన్నవరం: మోసపూరిత మాటలతో ప్రజలను దగా చేస్తున్న బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వాన్ని గద్దె దించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు టీవీ లక్ష్మణస్వామి పిలుపునిచ్చారు. సీపీఎం చేపట్టిన ప్రజారక్షణ భేరి యాత్ర ఆదివారం మండలంలోని దావాజిగూడెం, అల్లాపురం, బూతిమిల్లిపాడు, బుద్దవరం, అజ్జంపూడి, కేసరపల్లి గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు ప్రజలు కలిసి రావాలని కోరారు. బుద్దవరం సర్పంచి బడుగు బాలమ్మ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపు



గన్నవరంరూరల్: పుస్తక పఠనంతో విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందుతుందని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ కె.కృపానందం చెప్పారు. స్థానిక లైబ్రేరిలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో దసరా సెలవుల్లో భాగంగా ఆదివారం విద్యార్థులకు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో గ్రంథాలయంలో పుస్తకాలను చదివించారు. పాఠకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు ఎంపిక



హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు హనుమాన్‌జంక్షన్‌కు చెందిన టైగర్ పవర్ క్లబ్ క్రీడాకారులు ఎంపికైనట్లు కోచ్ వర్రె అంజిబాబు ఆదివారం తెలిపారు. ఇటీవల విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగిన జూడో ఉమ్మడి కృష్ణాజిల్లా జట్టు సెలక్షన్స్‌లో టైగర్ పవర్ క్లబ్ క్రీడాకారులు సత్తా చాటారని చెప్పారు. అండర్-14 బాలుర విభాగంలో జి.మణికంఠ (40 కేజీల కేటగిరి), బాలికల విభాగంలో బి.శ్రావణి (25 కేజీలు), ఎ.రాజేశ్వరి(32 కేజీల కేటగిరి) ఎంపికయ్యారన్నారు. అండర్-17 బాలుర విభాగంలో జె.మణికంఠ (70 కేజీల కేటగిరి), బాలికల విభాగంలో ఆర్.స్వర్ణకుమారి (48 కేజీల కేటగిరి) ఎంపిక అయ్యారని చెప్పారు. వీరంతా ఈ నెల 28, 29, 30 తేదీల్లో అనంతపురంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు ఉమ్మడి కృష్ణా జిల్లా తరుపున ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. సాయి గౌతమ్ స్కూల్ వ్యాయామోపాధ్యాయుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కార్మికుల వివరాలు యజమానుల వద్ద ఉండాలి



పెనమలూరు: మండల పరిధిలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి పని చేస్తున్న కార్మికుల పూర్తి వివరాలు యజమానుల వద్ద ఉండాలని పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపారు. ఆయన ఆదివారం రాత్రి పెనమలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో కానూరు, సనత్‌నగర్ పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మండల పరిధిలో ఉంటున్న ఉత్తరప్రదేశ్, బీహార్, వెస్ట్‌బెంగాల్, ఒడిశా, ఇతర రాష్ట్రల నుంచి వచ్చిన కార్మికులతో సీఐ మాట్లాడారు. కార్మికులు యజమాని వద్ద పనిలో చేరే సమయంలో ఆధార్ కార్డుతో పాటు పూర్తి చిరునామా, కుటుంబ సభ్యుల వివరాలు, ఫోన్ నంబర్లు, యజమానులకు వివరాలు ఇవ్వాలన్నారు. డ్యూటీ సమయాలతో తప్ప రాత్రి సమయాల్లో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు సంచరించరాదని తెలిపారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు కార్మికులు దూరంగా ఉండాలని సూచించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులపై నిరంతర నిఘా ఉంటుందన్నారు. యసజమానులు కూడా కార్మికుల వివరాలు సేకరించాలని తెలిపారు. ఏదైనా నేరాలు జరిగితే యజమానులు కార్మికుల వివరాలు వెల్లడించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా ప్రారంభమైన దసరా ఉత్సవాలు

- బాలాత్రిపురసుందరీదేవిగా దర్శనం
- ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ



యనమలకుదురులో శైలపుత్రీదేవి అలంకరణలో అమ్మవారు



ప్రొద్దుటూరులో బాలాత్రిపురసుందరీదేవిగా..



ఉయ్యూరులోని విజయదుర్గాదేవి ఆలయంలో..



పురుషోత్తపట్నంలో బాలాత్రిపురసుందరీదేవిగా..



లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదిలక్ష్మిగా..



ఉయ్యూరు శివాలయంలో జగదాంబదేవిగా

పెనమలూరు: పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల్లో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయాల్లో అమ్మ వార్లు తొలి రోజు బాలా త్రిపురసుందరీదేవిగా దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాలకు చేరుకుని అమ్మ వార్లను దర్శించుకున్నారు. దీంతో ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. యనమలకుదురులో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో శ్రీపార్వతీదేవిగా అమ్మవారిని శైలపుత్రిదేవిగా దివ్య అలంకరణ చేశారు. ఉదయం చండీహోమం, సాయంత్రం సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు జీఆర్‌వీ సాగర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. పోరంకి శ్రీనివాసానగర్‌లోని శ్రీషిరిడీ సాయిబాబా మందిరం, యనమలకుదురు శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయం, పెదపులిపాక గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ విజయరాజరాజేశ్వరి ఆలయంలో శ్రీ వాసుదేవానందగిరిస్వామీజీ ఆధ్వర్యంలో, పెనమలూరు శ్రీసీతారామాలయాల్లో శరన్నవరాత్రుల మహోత్సవాలు ప్రారంభించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

కంకిపాడులో దేవీ నవరాత్రులు

కంకిపాడు: దసరా దేవీ నవరాత్రులు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వివిధ రూపాల్లో కొలువైన అమ్మవారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. ప్రొద్దుటూరు గ్రామంలోని శివాలయంలో కాశీ అన్నపూర్ణాదేవి బాలాత్రిపుర సుందరీదేవిగా భక్తుల పూజలందుకున్నారు. కంకిపాడు శివాలయం, ఈడుపుగల్లులోని శ్రీ కామేశ్వర, వీరభద్రస్వామి దేవస్థానంలో అమ్మవారు బాలాత్రిపురసుందరిగా దర్శనమిచ్చారు. ఉత్సవాలను ఆలయ కమిటీలు, ఉత్సవ కమిటీల ప్రతినిధులు, దేవదాయ శాఖ అధికారులు పర్యవేక్షించారు.

ఉయ్యూరులో ఉత్సవాలు

ఉయ్యూరు: దేవీ శరన్నవరాత్రులు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయాల్లో దసరా ఉత్సవాలు ఆదివారం అంకురార్పణ చేశారు. పట్టణంలోని శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో బాలా త్రిపుర సుందరీ దేవిగా అమ్మవారు దర్శనమిచ్చి పూజలందుకున్నారు. శివాలయంలో జగదాంబ దేవిగా, గండిగుంట, పెద ఓగిరాల, ముదునూరు, కాటూరు, చిన ఓగిరాల ఆలయాల్లో అమ్మవారు బాలా త్రిపుర సుందరీ దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారికి భక్తులు విశేష పూజలు జరిపించారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

గన్నవరం నియోజకవర్గంలో శరన్నవరాత్రులు

గన్నవరం: శ్రీదేవి శరన్నవరాత్రుల మహోత్సవాలు గన్నవరం నియోజకవర్గంలో ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అల్లాపురంలో శ్రీదుర్గాభవాని కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉత్సవాలను ఎంపీపీ అనగాని రవి, సర్పంచి డొక్కు సాంబశివవెంకన్నబాబు ప్రారంభించారు. అనంతరం పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మాజీ వైస్ ఎంపీపీ గొంది పరందామయ్య, ఎంపీటీసీ సభ్యులు త్రిపురనేని బాబీ, ఉప సర్పంచి ఆవుటపల్లి శివప్రసాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. స్థానిక శ్రీవాసవీమాత మందిరంలో ఉత్సవాలకు కలశస్థాపన చేశారు. సంఘ ప్రముఖులు గోంట్ల బాలశంకర్, కందగడ్డల కృష్ణారావు, మాడుపల్లి బాలకృష్ణమూర్తి, కంచర్ల శివనాగేశ్వరరావు, బి.రామ్మోహన్‌రావు పాల్గొన్నారు. స్థానిక శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో కాసరనేని బాబూరావు, బేబిసరోజిని దంపతులు కలశ స్థాపనతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అమ్మవారు శ్రీబాలత్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం గోపూజ, శ్రీలలితా సహస్రనామ, ఖడ్గమాల పారాయణం, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. స్థానిక యాదవ రామాలయంలో వికాస్ కళాశాలల వైస్ చైర్మన్ నరెడ్ల సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు నిర్వహించారు. దావాజిగూడెంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో సామూహిక కుంకుమార్చనలు, శ్రీలలితా, హనుమాన్ చాలీసా పారాయణం జరిపారు.



అల్లాపురంలో అమ్మవారిని దర్శించుకుంటున్న ఎంపీపీ రవి తదితరులు



చినకంచిలో కామాక్షి అమ్మవారికి పూజలు



పోరంకిలో బాలాత్రిపురసుందరీదేవి

చినకంచిలో విశేష పూజలు

విజయవాడరూరల్: నున్న గ్రామం శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామి దేవస్థానం చినకంచిలో కామాక్షి అమ్మవారికి అలంకారం చేసి అభిషేకాలు నిర్వహించి పూజలు చేశారు. చండీహోమాలు, ఖడ్గమాల, కుంకుమ పూజలు, విశేష పూజాధి కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీషిర్డి సాయిబాబా మందిరం, చెరువు సెంటర్లోని శ్రీదుర్గాదేవి దేవస్థానం, విలేజి కంద్రికలో శ్రీకనకదుర్గమ్మ బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకారం చేసి పూజలు నిర్వహించారు. పాతపాడు గ్రామంలో, పి.నైనవరం గ్రామంలోని శివనాగేంద్ర దేవస్థానంలో, అంబాపురం గ్రామం శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో నవరాత్రులు ప్రారంభమయ్యాయి. తొలిరోజు బాలా త్రిపుర సుందరీదేవిగా భక్తులు దర్శించుకున్నారు.



వాసవీమాత మందిరంలో కలశస్థాపన చేస్తున్న కమిటీ సభ్యులు

గన్నవరం రూరల్‌లో..

గన్నవరంరూరల్: మండలంలోని గ్రామాల్లో ఆదివారం దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. పలు దేవాలయాల్లో అమ్మవారిని తొలిరోజు బాలా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించి భక్తులు పూజలు చేశారు. ముస్తాబాద శివాలయంలో వేద అర్చకులు భాస్కర శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు చేశారు. పురుషోత్తపట్నం శివాలయంలో వేద అర్చకులు కొండవీటి హరి ఆధ్వర్యంలో అమ్మవారికి అలంకారం, పూజలు జరిగాయి. ఆయా శివాలయాల్లో శివలింగాలకు అభిషేకాలు చేశారు.

ఆదిలక్ష్మి అమ్మవారిగా దర్శనం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక నూజివీడు రోడ్డులోని లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు అమ్మవారి భక్తులకు ఆదిలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ ట్రస్టీ కాకాని వెంకటేశ్వరరావు (భాబు), మాజీ సర్పంచ్ కాకాని అరుణ దంపతుల విరాళంతో దేవస్థానాన్ని విశేషంగా రకరకాల పూలతో అలంకరించారు. మహాత్మా గాంధీనగర్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఉత్సవ మండపంపై అమ్మవారిని బాలాత్రిపురసుందరీ దేవిగా అలంకరించారు. వీరవల్లిలోని తిరుపతమ్మ దేవస్థానం, బొమ్ములూరులోని రామాలయంలోనూ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు.



కంకిపాడు శివాలయంలో..

పేరంటాలమ్మ ఆలయంలో..

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఆదివారం నుంచి దసరా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని పలు పుష్పాలతో ముస్తాబు చేశారు. పలువురు దేవతా మూర్తుల ప్రతిమలతో ఆలయాన్ని అలంకరించారు. తొలి రోజు సందర్భంగా కలశ స్థాపన, పుణ్యాహ వాచకం, కుంకుమార్చనలతో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. పేరంటాలమ్మను శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. సోమవారం అమ్మవార్లను శ్రీ గాయత్రీ దేవిగా అలంకరించనున్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి, చైర్మన్ బోయిన భానుప్రదీప్, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.



బాలాత్రిపురసుందరీదేవి అలంకరణలో పేరంటాలమ్మ

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



ఉప్పలూరులో రైతులతో సమీక్ష చేస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి, భవకుమార్ తదితరులు

కంకిపాడు: రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని ఉప్పలూరు గ్రామంలో ఆదివారం రైతులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎగువ ప్రాంతంలో ఉన్న భూములకు సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఎమ్మెల్యేకు వివరించారు. సాగునీరు అవసరాలను తీర్చుకోవటానికి బుడమేరు నుంచి ఆయిల్ ఇంజన్ల ఏర్పాటుతో సమస్య పరిష్కారమవుతుందన్నారు. దీనిపై ఎమ్మెల్యే పార్థసారథి డ్రెయినేజీ, విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష చేశారు. ఇంజన్లను ఏర్పాటు చేసుకుంటే అవసరమైన డీజిల్, ట్యూబ్‌లను సమకూరుస్తామని హామీ ఇచ్చారు. ఇందుకు గానూ రూ.20 వేలు ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే పార్థసారథి రైతులకు అందించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిలబడుతుందన్నారు. ఆందోళన చెందాల్సిన పనిలేదని, అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొప్పన భవకుమార్, సర్పంచ్ లాం సోనియా, ఎంపీటీసీ లాం పార్వతి, నాయకులు నెరుసు సతీష్, మాగంటి శ్రీనివాసరావు, పిన్నబోయిన శ్రీనివాసరావు, లాం సురేష్ పాల్గొన్నారు.

మారేడుమాకలో గడప గడపకు..

మారేడుమాక గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పాలన వివరించి, ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధితో రూపొందించిన సంక్షేమ బ్రోచర్లను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఖరీఫ్ ధాన్యం సేకరణకు అధికారులు, పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలన్నారు. అర్హులైన పేదలకు ఇళ్లస్థలాలు, సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతిపక్షాలు చేస్తున్న రాద్ధాంతాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అనారోగ్యంతో బాధపడుతున్న పంచాయతీ కార్మికుడు నాగేశ్వరరావు కుటుంబానికి రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ బాకీ బాబు, సర్పంచ్ సీహెచ్ ఆదర్శకుమార్, ఎంపీటీసీ ఉప్పలూరి శాంతి, ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, నాయకులు వీర్ల మోహన్‌రావు, కొలుసు పద్మరాజు, వీర్ల జగదీష్, చెన్నుబోయిన సుబ్బారావు, సునీల్, లంక వెంకయ్య, తహసీల్దార్ ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారుల ఉన్నతికి తోడ్పాటు

కంకిపాడు: క్రీడాకారుల ఉన్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని తెన్నేరు గ్రామ శివారు కోమటిగుంటలో క్రీడాకారులు తమ క్రీడా సామగ్రి కావాలని కోరటంతో ఆదివారం క్రీడా కిట్లను ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ బాకీ బాబు చేతుల మీదుగా క్రీడాకారులకు అందజేశారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ.. ప్రతిభావంతులైన క్రీడాకారుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. క్రీడల ద్వారా శారీరక, మానసిక దృఢత్వం నెలకొంటుందన్నారు. క్రీడల్లో రాణించటం ద్వారా ఉజ్వల భవిత సాధ్యమని వివరించారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన..

రోడ్డు నిర్మాణ పనులు, మౌలిక వసతుల కల్పన సమర్థంగా సాగాలని ఎమ్మెల్యే పార్థసారథి ఆదేశించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కోమటిగుంటలో ఇటీవల ఎమ్మెల్యే పర్యటించారు. స్థానికులు అంతర్గత రహదారి అభివృద్ధి చేయాలని కోరారు. దీంతో యుద్ధప్రాతిపదికన రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. నిర్మాణంలో ఉన్న రోడ్డు పనులను ఆదివారం పరిశీలించారు. నిర్మాణ పనుల్లో ఎక్కడా లోపాలు తలెత్తకుండా చూడాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు నెరుసు సతీష్, దండాబత్తిన సుబ్బారావు, రామకృష్ణ, సర్పంచ్‌లు సిహెచ్ ఆదర్శకుమార్, జుజ్జవరపు ఎలీషా, మేరుగు విజయ చంద్రశేఖర్, లాం సురేష్ పాల్గొన్నారు.



క్రీడా సామగ్రి అందజేస్తున్న ఎంపీపీ రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ బాకీ బాబు తదితరులు

1,800 మందికి అన్నదానం

భవానీపురం(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ భక్తుల ఆకలిదప్పులు తీర్చడం అభినందనీయమని ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ రుహుల్లా అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ సుప్రీమ్ ఆధ్వర్యంలో వన్‌టౌన్ రథం సెంటర్‌లోని అప్పన వెంకట కృష్ణయ్య ధర్మ సత్రం వద్ద క్లబ్‌కు సంబంధించి ఈ ఏడాది రిలీవింగ్ హంగర్ కార్యక్రమ రికగ్నైజ్ డీసీ అప్పన వెంకట సత్యసాయి బాబు సహకారంతో అన్నదానం చేశారు.

స్ఫూర్తిప్రదాత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం

ఉయ్యూరు: మిసైల్ మెన్, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం స్ఫూర్తిప్రదాత అని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్ తెలిపారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం జయంతి ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. లయన్స్ ప్రతినిధులు నల్లా శ్రీనివాస్, ఊర కిషోర్ కుమార్, డాక్టర్ రావులపల్లి సుధాకర్, వీణవాహి ప్రసాద్ పాల్గొన్నారు.

కలాం ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి

పెనమలూరు: అబ్దుల్‌కలాం ఆశయాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ఆర్విన్స్ గ్రూప్ సీఈవో కొనిగండ్ల శశిధర్ అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో ఆదివారం మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం జయంతి ఎన్ఎస్ఎస్ యూనిట్, లిటిల్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కలాం అందించిన సేవలను కొనియాడారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, పలు సంస్థల ప్రతినిధులు ఫణిరాజ్, కిరన్‌రాథోడ్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

కలాం జీవితం ఆదర్శనీయం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: నేటితరం విద్యార్థులకు అబ్దుల్ కలాం జీవితం ఆదర్శనీయమని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్ర కన్వీనర్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. స్థానిక ఏలూరురోడ్డులోని గణపతి కాంప్లెక్స్‌లో భారతరత్న, మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి వేడుకలను మానవత ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్న పేద విద్యార్థి పర్వతనేని షణ్ముఖ సాయికి మానవత తరుపున రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మానవత జిల్లా కోశాధికారి వడ్డి రాజేశ్వరరావు, హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కూరెళ్ల సుబ్బాచారి, కళ్లేపల్లి నారాయణరావు, సీనియర్ సభ్యులు గంటా సత్యనారాయణ, నారగాని కొండలరావు, పాట్లూరి శేషాచలం, కనిగంటి సుబ్బారావు, వేగిరెడ్డి సూర్యనారాయణ, ఇందిరాదేవి పాల్గొన్నారు.



ఉయ్యూరులో నివాళులర్పిస్తున్న లయన్స్ ప్రతినిధులు



వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో ప్రసంగిస్తున్న శశిధర్

సమాజ సేవలో యువత భాగస్వామ్యం కావాలి



విజేతలతో రోటేరియన్లు

గన్నవరం: సమాజ సేవలో యువత భాగస్వామ్యం కావాలని రోటరీ క్లబ్ 3020 డిస్ట్రిక్ట్ గవర్నర్ రావూరి సుబ్బారావు(దత్త) పిలుపునిచ్చారు. వారం రోజులుగా రోటరీక్లబ్ ఆఫ్ గన్నవరం శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న యువజనోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా స్థానిక రోటరీ ఆడిటోరియంలో క్లబ్ అధ్యక్షుడు జాస్తి విజయభూషణ్‌కుమార్ నేతృత్వంలో విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించారు.

రోటేరియన్లకు సత్కారం..

అనంతరం దత్త మాట్లాడుతూ.. సమాజాభివృద్ధిలో రోటరీక్లబ్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. నిరంతరం వైద్య శిబిరాలు, అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. యువతను ప్రోత్సహించేందుకు ప్రతి ఏటా యువజనోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వారోత్సవాల్లో గెలుపొందిన 160 మంది విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం పుణ్య చారిటీస్ ద్వారా ఎంఈఎఫ్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఉచిత ట్యూషన్ సెంటర్‌కు 5 ఫ్యాన్లు, దావాజిగూడెం బీసీ బాలికల హాస్టల్ విద్యార్థులకు వంద చాపలు, చిన్నఆవుటపల్లి గ్రామపంచాయతీకి మార్చురీ బాక్స్‌ను, హీల్ ప్యారడైజ్‌కు రూ.లక్ష విరాళం అందజేశారు. పలువురు రోటేరియన్లను సత్కరించారు. క్లబ్ కార్యదర్శి నర్రా సీతారామారావు, హీల్ ప్యారడైజ్ సీఈఓ కూరపాటి అజయ్‌కుమార్, రోటేరియన్లు చింతపల్లి సీతారామారావు, గన్నె వెంకట్రావు, నెక్కలపూడి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.